## క్లుప్తంగా

### విగ్రహాల బహూకరణ



ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు

**సంగం :** సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన వేమా మల్లికార్జున దంపతులు రూ.3.50 లక్షల విలువైన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవ విగ్రహాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను మంగళవారం గ్రామంలో వైభవంగా ఊరేగించారు. భక్తులు ఉత్సవ విగ్రహాలను దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన



**సోమశిల :** అనంతసాగరం మండల పరిధిలోని పడమటికంభంపాడు గ్రామ ఎస్సీ కాలనీ, మాతమ్మ ఆలయం వద్ద మంగళవారం సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ హాజరై, మాట్లాడారు. రూ.4.5 లక్షల నిధులతో రోడ్డు పనులను ప్రారంభించినట్లు చెప్పారు. అనంతరం ఆమె గ్రామ సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. తర్వాత ప్రభుత్వ పాఠశాలను పరిశీలించి పిల్లలతో మాట్లాడారు. ఎంపీటీసీ నాగిపోగు రాధమ్మ, తిరుపాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### నందిపాడు సొసైటీలో డీసీఓ తనిఖీ



**దుత్తలూరు :** మండలంలోని నందిపాడు పీఏసీఎస్‌ను జిల్లా సహకార అధికారి(డీసీఓ) బి.గురప్ప మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందిపాడు సొసైటీని పూర్తిగా ఆన్‌లైన్ చేశామని, ఇక నుంచి జరిగే ప్రతి లావాదేవీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం రైతులకు పలు పత్రాలను అందజేశారు. అలాగే సొసైటీ ఆవరణలో మొక్కలు నాటారు. సీఈఓ శ్రీనివాసులు, సహకార సిబ్బంది పాల్గొన్నారు.

### ఏబీఎం ఆస్తులను కాపాడాలి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న సంఘ సభ్యులు

**ఉదయగిరి :** పట్టణంలోని అమెరికన్ బాప్టిస్ట్ చర్చికి సంబంధించిన 40 ఎకరాల ఆస్తిని(ఏబీఎం కాంపౌండ్)ని కాపాడాలని కోరుతూ ఆ సంఘ సభ్యులు మంగళవారం తహసీల్దార్ సుభద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఆస్తిని కాజేసేందుకు కొంతమంది ప్రయత్నించి ప్లాట్లు ఏర్పాటు చేశారని, దీనిని కూడా గతంలో అడ్డుకున్నామన్నారు. దీనికి సంబంధించి ఇరుపక్షాల వైపున కేసులు నమోదయ్యాయని, కోర్టు తీర్పు తమకు అనుకూలంగా వచ్చిందని చెప్పారు. ఈ ఆస్తికి సంబంధించి ఎలాంటి క్రయ విక్రయాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని వారు కోరారు.

### విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు



**వరికుంటపాడు :** మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు పోలీసుల ఆధ్వర్యంలో వక్తృత్వ పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రఘునాథ్ మాట్లాడుతూ ఈనెల 8న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోటీలను నిర్వహించామన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్నిరంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తున్నారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పొగాకు బ్యారెన్ దగ్ధం

**కావలి :** మండలంలోని చౌదరిపాళెంలో చిడిపోతు వెంకటేశ్వర్లుకు చెందిన పొగాకు బ్యారెన్ మంగళవారం ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది. పొగాకు బ్యారెన్‌లో మంటలు వచ్చి పొగాకు పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు నష్టం వాటిలినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఆదర్శ విద్యాలయాలు

### దరఖాస్తులు షురూ..

ఆదర్శ పాఠశాలల్లో 2025 - 26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. మార్చి 31వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుంది. అర్హత సాధిస్తే రుసుం చెల్లించాలి. తరువాత ఒక జర్నల్ నంబర్ కేటాయిస్తారు. దీని ఆధారంగా cse.ap.gov.in లేదా apms.apcfss.in లో దరఖాస్తు చేసుకోవచ్చు. దానికి సంబంధించిన దరఖాస్తు నకలను పాఠశాలలో సమర్పించాలి.

### వీరే అర్హులు..

ఓసీ, బీసీఈ విద్యార్థులు 2013 సెప్టెంబర్ ఒకటి నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించిన వారు అర్హులు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2011 సెప్టెంబర్ ఒకటి నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 పరీక్ష ఫీజు చెల్లించాలి. ప్రభుత్వం లేదా ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలల్లో నిరవధికంగా ఐదో తరగతి చదివి ఉండాలి. ప్రవేశ పరీక్షల్లో ఓసీ, బీసీ విద్యార్థులు 35, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 30 మార్కులు కచ్చితంగా వచ్చి ఉండాలి.



కలిగిరిలోని ఆదర్శ పాఠశాల

మెట్ట ప్రాంత చిన్నారులకు ఉత్తమ విద్యను అందించాలని దివంగత సీఎం వైఎస్సార్ తన హయాంలో కలలుగన్నారు. ఇందులో భాగంగా ఏపీ మోడల్ పాఠశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ తరుణంలో ఆయన ఆశయాలకు అనుగుణంగా 2013లో ఉదయగిరి నియోజకవర్గంలోని కలిగిరితో పాటు కొండాపురం, దుత్తలూరు, సీతారామపురంలో ఏపీ మోడల్ పాఠశాలలు ప్రారంభమయ్యాయి. – కలిగిరి

- దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో పునాది
- 2013లో ప్రారంభం
- నానాటికీ పెరుగుతున్న ఆసక్తి
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

**సీట్లకు భారీ డిమాండ్**

పేద, మధ్య తరగతి పిల్లలకు ఉన్నత చదువులు అందించడానికి ఏర్పాటైన ఆదర్శ పాఠశాలల్లో సీట్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. విద్యార్థులు ఆరో తరగతిలో ప్రవేశం పొందితే ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లిషు మీడియం విద్యను పొందవచ్చు. ప్రభుత్వం ద్వారా ఉచిత పాఠ్య పుస్తకాలు, విద్యాకానుక కిట్లు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు అందుతాయి. ప్రైవేటు పాఠశాలల్లో ఎంత ఖర్చు పెట్టినా అందుబాటులో లేని నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం ఆదర్శ పాఠశాలల్లో లభించడం పేద, మధ్య తరగతి విద్యార్థులకు వరంగా మారింది.

**లభించే సదుపాయాలు**

ఐదు ఎకరాల ప్రాంగణంలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా భవనాలు, సదుపాయాలు ఉండటం ప్రత్యేకత. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధనతో ఎంతో మంది ఆసక్తి చూపుతున్నారు. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రతిష్ఠాత్మకంగా ఇంగ్లిష్ మీడియంలో బోధన. సౌకర్యవంతంగా విశాలమైన తరగతి గదులతో పాటు నీట్, ఎంసెట్, జేఈఈ వంటి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ లభిస్తుంది. కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయాలజీ సబ్జెక్టులను వేర్వేరుగా పూర్తి స్థాయిలో ల్యాబ్‌లు, స్పోకెన్ ఇంగ్లిష్, చేతిరాతపై ప్రత్యేక శ్రద్ధ, పూర్తి సదుపాయాలతో లైబ్రేరీ అందుబాటులో ఉంటుంది. డిజిటల్ విద్యా విధానం, ఎల్‌సీడీ ప్రాజెక్టర్‌తో విద్యా బోధన, తొమ్మిదో తరగతి నుంచి అకడమిక్ విద్యకు సమాంతరంగా కనీసం రెండు ఒకేషనల్ కోర్సుల బోధన అందిస్తారు.

### నాణ్యమైన విద్యాబోధన



పేద, మధ్య తగరతి విద్యార్థులకు ఆదర్శ పాఠశాలలు బంగారు భవిష్యత్తును ఇస్తాయి. ఐదో తరగతి పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థి ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మోడల్ స్కూళ్లలో విద్యాబోధన జరుగుతుంది. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– అన్నవరపు శ్రీనివాసులు, ప్రిన్సిపల్ , ఏపీ మోడల్ స్కూల్, కలిగిరి



పాఠశాలలోని సైన్స్ ల్యాబ్



డిజిటల్ బోధన



ప్రయోగాలు చేస్తున్న విద్యార్థినులు

### విద్యుత్ సేవల్లో లైన్‌మెన్ల పాత్ర కీలకం

**దగదర్తి(బిట్రగుంట) :** విద్యుత్ సేవల్లో లైన్‌మెన్‌ల పాత్ర కీలకమని దగదర్తి ట్రాన్స్‌కో ఏఈ షేక్.దస్తగిరి అన్నారు. దగదర్తి సెక్షన్ కార్యాలయంలో లైన్‌మెన్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించేందుకు, సరఫరాలో సమస్యలను చక్కదిద్దడంలో నిరంతరం సేవలందిస్తున్న లైన్‌మెన్‌లను సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఈ దస్తగిరి, ఇతర అధికారులు మాట్లాడుతూ వర్షాలు, ఇతర విపత్తుల సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా లైన్‌మెన్‌లు ప్రాణాలకు తెగించి సేవలందించడం అభినందనీయమన్నారు. అనంతరం వారికి కటింగ్‌ప్లేయర్లు, టెస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అల్లూరు టౌన్, అల్లూరు రూరల్, బోగోలు ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ

**ఆత్మకూరు :** పట్టణంలోని జేఆర్‌పేటలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి వివరాల మేరకు.. పట్టణానికి చెందిన కాటాబత్తిన రామకృష్ణ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నారు. అతని తండ్రి వెంకట సుబ్బయ్య ఆత్మకూరులో ఉంటుండగా నెల రోజుల క్రితం ఆయన కూడా కుమారుడి దగ్గరకు వెళ్లారు. జేఆర్‌పేటలోని వారి ఇంట్లో మంగళవారం తెల్లవారుజామున మెయిన్ డోర్‌ను పగులగొట్టి ఉండడాన్ని సమీపంలోని వారు గుర్తించి రామకృష్ణకు సమాచారం ఇచ్చారు. అతను వారి మిత్రుల ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయించారు. సాయంత్రానికి వచ్చి పరిశీలించి బీరువా తలుపులు తెరిచి ఉండడంతో అందులో ఉన్న కొన్ని వెండి వస్తువులతో పాటు సుమారు చైన్, ఉంగరాలు, కమ్మలు చోరీ అయినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న ఎస్సై జిలానీ దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

## ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించండి

- కావలి ఆర్డీఓ వంశీకృష్ణ



ధాన్యం కొనుగోలు కేంద్రంలో సూచనలు చేస్తున్న ఆర్డీఓ

**జలదంకి :** మండల పరిధిలో ప్రజలు, రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కావలి ఆర్డీఓ వంశీకృష్ణ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలాధికారులతో సమీక్ష సమావేశాన్ని ఆయన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ స్పందన ద్వారా వచ్చిన అర్జీలను తహసీల్దార్‌తో పాటు ప్రతి డీటీ, వీఆర్వోలు పరిష్కరించాలని ఆదేశించారు. స్పందన ద్వారా వచ్చిన అర్జీలపై ప్రతి నిత్యం సమాచారం అందించాలన్నారు. ప్రస్తుతం చామదలలో జరుగుతున్న రీసర్వే తీరును ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలన్నారు. రీసర్వేలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. అనంతరం ఆర్డీఓ జలదంకిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతులకు ఉచితంగా అందుతున్న గోతాలు, రవాణా చార్జీలపై అవగాహన కల్పించి మద్దతు ధరకు అమ్ముకునేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఓ శైలజ, రీసర్వే డీటీ శ్యాంసన్, సర్వేయర్ శోభన్‌బాబు, తహసీల్దార్ ప్రమీల, డీటీ జూలీబాయ్, ఆర్‌ఐ నరసింహారావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీజ, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల శ్రేయస్సే ధ్యేయం



జోనల్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న వివిధ వర్గాల ప్రతినిధులు

**ఆత్మకూరురూరల్ :** ఉద్యోగులు, కార్మికులతో పాటు ప్రయాణికుల శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తామని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరు ఆర్టీసీ డిపోను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. వివిధ విభాగాలకు సంబంధించి పరిశీలించారు. ఈ సందర్భంగా బస్సుల రన్నింగ్ కండీషన్‌తో పాటు ప్రయాణికులకు అందుతున్న సేవలు, కార్మికుల సమస్యలపై ఆరాతీశారు. ప్రజల నుంచి అందిన వినతులను స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కాగా రాత్రి వేళల్లో హైవేపై వెళ్లే బస్సులు ఎంజీఆర్ బస్‌స్టేషన్ మీదుగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన సేవా సంస్థల ప్రతినిధులు విన్నవించారు. అమరావతి, శ్రీశైలం, చెన్నై, కర్నూలు తదితర ప్రాంతాల బస్సులు పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట డిపో మేనేజర్ కరిముల్లా, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుడుముల సుధాకర్‌రెడ్డి, కిసాన్ మోర్చా నాయకులు కంచి సుధాకర్ రెడ్డి, నరసింహులు నాయుడు, బీజేపీ నియోజకవర్గ అధ్యక్షుడు కంది మల్లికార్జునరెడ్డి, పట్టణాధ్యక్షుడు సంతోష్‌కుమార్, సేవా సంస్థల ప్రతినిధులు వాయుగుండ్ల ఉమామహేశ్వరరావు, గార్లపాటి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### సీఆర్‌ఎంటీలు బాధ్యతగా పనిచేయాలి

**ఉదయగిరి :** మండలంలో స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో సీఆర్‌ఎంటీలు బాధ్యతగా పనిచేయాలని ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు సూచించారు. ఆయన తన కార్యాలయంలో సీఆర్‌ఎంటీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యాలయ సిబ్బంది, సీఆర్‌ఎంటీలు సమయపాలన పాటిస్తూ ప్రభుత్వ నిబంధనల మేరకు పనిచేయాలన్నారు. క్లస్టర్లకు సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో ఉంచుకోవాలన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి స్టూడెంట్ కిట్స్ నాణ్యతను పరిశీలిస్తూ క్లస్టర్లకు చేరేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దాతల సహకారంతో పాఠశాలల అభివృద్ధి, సదుపాయాలను మెరుగుపరుచుకోవాలన్నారు. అనంతరం ఆయన మండలంలోని వెంకట్రావుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగుతున్న అదనపు తరగతి గది పనులను పరిశీలించి సూచనలు చేశారు.

### 58 మద్యం బాటిళ్ల స్వాధీనం

**బిట్రగుంట :** బోగోలు మండలం ఎస్వీపాళెంలో బెల్టు దుకాణం నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ అధికారులు మంగళవారం మెరుపు దాడులు నిర్వహించారు. రామలింగం నాగార్జున అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి 58 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దాడుల్లో కావలి ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### శ్మశానానికి హద్దులు చూపాలని వినతి



**ఉదయగిరి :** మండలంలోని మాసాయిపేట గ్రామంలో ఉన్న ముస్లింల శ్మశాన స్థలానికి హద్దులు చూపాలని పలువురు ముస్లింలు మంగళవారం తహసీల్దార్ సుభద్రను ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పెద్దల కాలం నుంచి బస్టాండ్ సెంటర్‌లోని దర్గా స్థల ఆవరణలో ఖననం చేస్తున్నామన్నారు. కాగా ఆ స్థలం ఆక్రమణకు గురవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ సిబ్బందిని పంపి పరిశీలించి న్యాయం చేస్తామన్నారు.

### దరఖాస్తుల స్వీకరణకు రేపే గడువు

**చేజర్ల :** మండలంలోని ఆదురుపల్లిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో ఐదో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ 6వ తేదీతో ముగియనున్నట్లు ప్రిన్సిపల్ శైలజా కుమారి తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం

- అడ్డుకున్న అధికారులు



**వింజమూరు(ఉదయగిరి) :** స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో ఓ వ్యక్తి అక్రమంగా కట్టడాలు నిర్మిస్తున్న నేపథ్యంలో మంగళవారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. అయితే సదరు వ్యక్తి గతంలో ప్రభుత్వ భూమి అని తెలియక కొనుగోలు చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. రెవెన్యూ అధికారులు నిర్మాణాన్ని ఆపివేసి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

### ఆర్థిక సాయం అందజేత



**ఆత్మకూరు :** పట్టణంలో వివిధ కారణాలతో ఐదుగురు ఇటీవల మృతి చెందడంతో ఆయా కుటుంబాలకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని మంగళవారం అందజేశారు. 14వ వార్డుకు చెందిన షేక్.బీబీజాన్, ఆరికొండ రమణయ్య, 15వ వార్డుకు చెందిన అమీర్‌జాన్, 16వ వార్డుకు చెందిన పిడుగు వెంకటేష్, 23వ వార్డుకు చెందిన మోపూరు నరసింహులు ఇటీవల అనారోగ్య కారణాలతో మృతిచెందారు. దీంతో ఆయా కుటుంబాలను కంచి పరమేశ్వరరెడ్డి పరామర్శించి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, కంది హజరత్‌రెడ్డి, అచ్చోలు నరసింహారెడ్డి ఉన్నారు.

### దాడులపై పుకార్లు.. దుకాణాల మూత



మూసివేసిన దుకాణాలు

**ఉదయగిరి :** పట్టణంలోని వివిధ వ్యాపార సంస్థలకు సంబంధించిన దుకాణాలపై సేల్స్ ట్యాక్స్ అధికారులు మంగళవారం దాడులు చేస్తున్నారనే పుకార్లు షికార్లు చేశాయి. దీంతో ఆయా యజమానులు దుకాణాలను మూసివేశారు. గత రెండు మూడు రోజుల నుంచి ఇలాంటి పుకార్లు ప్రచారంలో ఉన్నాయి. అధికారులు ఎప్పుడు దాడులు చేస్తారో, తమ లావాదేవీలు ఎక్కడ బయటపడతాయో అనే భయంతో రోజులో ఎక్కువసేపు దుకాణాలను మూసివేస్తున్నారు.

## లక్ష్యాల సాధనే లక్ష్యం

**ఉదయగిరి :** మండలంలో వైద్యారోగ్య సిబ్బంది కేటాయించిన లక్ష్యాలను ఈనెల చివరి నాటికి నూరు శాతం సాధించాలని మండల వైద్యాధికారిణి ఎం.శివకల్పన కోరారు. ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం పాత భవనంలో ఆశా డే కార్యక్రమాన్ని ఆమె మంగళవారం నిర్వహించారు. సర్వేలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలన్నారు. గ్రామాల్లో బాల్యవివాహాలు జరగకుండా చూడాలన్నారు. వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

**పూర్తి చేయాలి**

**దుత్తలూరు :** ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నూరు శాతం పూర్తి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ బ్రిజిత తెలిపారు. దుత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో కాన్పుల సంఖ్య, రక్త పరీక్షలను పెంచాలన్నారు. రోజుకు 63 రకాల పరీక్షలు చేయాలన్నారు. పెరుగుతున్న ఎండల దృష్ట్యా తగినన్ని ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎన్‌సీడీ సర్వేలో చురుగ్గా పాల్గొని పూర్తి చేయాలన్నారు. వైద్యాధికారులు అయూబ్ అఫ్సర్, వనజ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

**నెలాఖరుకు గడువు**

**వరికుంటపాడు :** గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎన్‌సీడీ సర్వే పూర్తికి ఈనెలాఖరు వరకే గడువు ఉందని మండల వైద్యాధికారిణి కరిష్మా పేర్కొన్నారు. ఆమె స్థానిక పీహెచ్‌సీలో ఆశా డే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలందించాలన్నారు. గ్రామాల్లో రెండు వారాలకు మించి దగ్గు ఉన్న వారిని గుర్తించి పీహెచ్‌సీకి సిఫార్సు చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాజశేఖరరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## తలసేమియా బాధితులకు రెడ్‌క్రాస్ అండ



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమ్య

**కావలి :** తలసేమియా బాధిత పిల్లలకు రెడ్‌క్రాస్ అండగా ఉంటున్నట్లు కావలి రెడ్‌క్రాస్ తలసేమియా కేర్ సెంటర్ నిర్వహణాధికారిణి డాక్టర్ రమ్య అన్నారు. కావలి వెంగళరావునగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆశా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తలసేమియా వ్యాధిని గుర్తించడంపై సామాజిక కార్యకర్తలకు అవగాహన కల్పించారు. తలసేమియా పుట్టుకతో వచ్చే జన్యు సంబంధిత వ్యాధి అని, దీనికి గురైన చిన్నారులకు బోన్‌మారో నుంచి రక్తం ఉత్పత్తి కాదని, వారి ప్రాణాలు కాపాడేందుకు తరచుగా రక్తం ఎక్కించాల్సి ఉంటుందని వివరించారు. వైద్యారోగ్యశాఖ అధికారులు తమ పరిధిలో రక్తహీనత ఉన్న పిల్లలను గుర్తించి రెడ్‌క్రాస్‌కు సమాచారం అందిస్తే వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడంతో పాటు ప్రతినెలా రక్తం ఎక్కించడం, బలవర్థకమైన పౌష్టికాహారం అందిస్తామని తెలిపారు. తలసేమియా బాధిత చిన్నారులకు అండగా నిలిచే విషయంలో రెడ్‌క్రాస్ విలువైన సేవలు అందిస్తోందని వివరించారు. రెడ్‌క్రాస్ తలసేమియా సెంటర్ కన్వీనర్ కె.హరి, కల్లయ్య, అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యాధికారులు డాక్టర్ మేఘనాథ్, డాక్టర్ ఫరూక్, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### సమతుల ఆహారాన్ని తీసుకోవాలి

**వింజమూరు(ఉదయగిరి) :** ఊబకాయం తగ్గాలంటే సమతుల ఆహారంతో పాటు వ్యాయామం తప్పనిసరిగా చేయాలని విశ్రాంత డీఎంహెచ్ఓ మాశిలామణి అన్నారు. వింజమూరులోని మాశిలామణి వైద్యశాలలో ప్రపంచ ఊబకాయ నివారణ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊబకాయం ఆరోగ్యానికి సంబంధించి పెద్ద సమస్యగా ఉంటోందని, శరీరంలో కొవ్వు పదార్థాలు పేరుకుపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంచి ఆహారంతో పాటు జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని సూచించారు. డాక్టర్ ప్రశాంత్, పీఆర్వో హెప్సిబా, సిబ్బంది పాల్గొన్నారు.

### ఫిజియోథెరపీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

**సంగం :** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఫిజియోథెరపీపై పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి డాక్టర్లు రమేష్, సంతోష్ మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీవన విధానంలో జరుగుతున్న పలురకాల మార్పుల గురించి వివరించారు. పెయిన్ కిల్లర్లు వాడటం వల్ల కలిగే నష్టాల గురించి, మొబైల్ రేడియేషన్‌తో వచ్చే అనర్థాలను వారికి వివరించారు. ఎంపీడీఓ షాలెట్, ఈఓపీఆర్డీ వరప్రసాద్ పాల్గొన్నారు.

### రైతులకు శిక్షణ

**మర్రిపాడు :** మండలంలోని రామానాయుడుపల్లి, భీమవరం గ్రామాల్లో పంట కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణా కార్యక్రమాన్ని ఏఓ రామ్మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఏడీఏలు మారుతీదేవి, లక్ష్మీమాధవి రైతులకు పలు సూచనలు చేశారు. కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి జీవ నియంత్రణ పద్ధతులు, ఎరువుల వాడకం గురించి వివరించారు. సహాయకులు మల్లిక, ప్రవీణ్ పాల్గొన్నారు.

**క్షేత్ర దినోత్సవం**

**అనుమసముద్రంపేట :** ఏఎస్‌పేట మండలం హసనాపురం, చిరమన గ్రామాల్లో క్షేత్ర దినోత్సవాన్ని ఏఓ రజనీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఏడీఏ దేవసేనమ్మ పాల్గొని, పలు సూచనలు చేశారు. ఏఈఓ చిరంజీవి, వీఏఏ తులసీ, వీహెచ్ఏ సంధ్యారాణి పాల్గొన్నారు.

### పౌష్టికాహారంతో ఆరోగ్యం



**వింజమూరు (ఉదయగిరి) :** తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మజాకుమారి అన్నారు. మండలంలోని చాకలికొండ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలైన సజ్జలు, జొన్నలు, కొర్రలు లాంటివి తప్పక తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ షకీలా, అంగన్‌వాడీ కార్యకర్తలు ధనమ్మ, శ్రీదేవి, కేశవమ్మ, సుహాసిని పాల్గొన్నారు.